క్లుప్తంగా

రేపు ప్రజావేదిక

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 12న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద జరిగిన రూ.4.80 కోట్ల పనులకు సంబంధించి ఈ నెల 4 నుంచి 11 వరకు సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సామాజిక తనిఖీ నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

టింబర్ డిపోల మండల అధ్యక్షుడిగా శంకరయ్య



కమలాపూర్ : సామిల్ టింబర్ డిపోల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన దాసి శంకరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దాసి శంకరయ్యను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తవుటం రవీందర్, బాలసాని రమేశ్‌గౌడ్, దేశిని ఐలయ్యగౌడ్, నాంపెల్లి ప్రభాకర్, పాడేటి భిక్షపతి, జనగాని శివకృష్ణ గౌడ్, పాక చంద్రమౌళి, గట్టు శ్రీధర్, మెండు నర్సయ్య, ఆడెపు శ్రీకాంత్, నల్లాని సురేష్, బాషబోయిన రమేశ్, మాజీ ఎంపీటీసీ సయ్యద్ అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు పాడిశెట్టి గణేశ్ తల్లి రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి సోమవారం రాజేశ్వరి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన మేరగుర్తి కర్ణాకర్ తండ్రి సారయ్యకు ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు విరగగా శస్త్ర చికిత్స చేసుకున్నారు. అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేశ్, నాయకులు తోకల సమ్మిరెడ్డి, యువజన నాయకులు బేర్గు రాకేశ్, సాయి తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన నర్రా కిరణ్ కుమారుడు రాహుల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే కిరణ్‌తో పాటు 2005–2006లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు రూ. 25వేల నగదును కిరణ్‌కు అందించారు. పూర్వవిద్యార్థులు దాసి శ్రావణ్‌కుమార్, రంగు రాజేశ్, ఫైండ్ల భానుచందర్, బయ్యని కరుణాకర్, మైనాల అశోక్, కారింగుల కుమారస్వామి, సుమన్‌తో పాటు తదితరులు అందించినవారిలో ఉన్నారు.

కుటుంబ సభ్యులు మందలించారని..

- ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



సాంబరెడ్డి (ఫైల్)

నడికూడ : మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి.. చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని రాయపర్తి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పరకాల పోలీసుల కథనం ప్రకారం.. రాయపర్తికి చెందిన చెలుమల్ల సాంబరెడ్డి(55) బీపీ, షుగర్‌కు మందులు వాడుతూ గత కొన్ని రోజుల నుంచి తరచుగా మద్యం సేవిస్తున్నాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా, కుటుంబ సభ్యులు మందలించారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను.. మార్తస్వామి వ్యవసాయ భూమి వద్ద లుంగీతో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో పరకాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా కుటుంబ సభ్యుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

పశువుల ఆస్పత్రికి పక్కా భవనం కరువు

- 2017లో నూతన భవన నిర్మాణం
- అందులోకి తహసీల్దార్ కార్యాలయం
- రైతు వేదిక భవనంలోకి పశువైద్యశాఖ
- అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి



మండల కేంద్రంలోని రైతువేదికలో కొనసాగుతున్న పశువైద్యశాల

నడికూడ : మండల కేంద్రంలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థలో ఉండగా 2017 సంవత్సరంలో రూ.18 లక్షల అంచనా వ్యయంతో బీసీ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించారు. ఇంతలో 2018 సంవత్సరంలో కొత్తగా నడికూడను మండలంగా ఏర్పాటు చేసినప్పుడు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అధికారులు, పాలకులు నూతనంగా నిర్మించిన పశువైద్యశాల బిల్డింగ్‌ను తహసీల్దార్ కార్యాలయంగా వినియోగించుకున్నారు. అయితే మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ఓ బిల్డింగ్‌లో పశువైద్యశాలను తరలించారు. మూడు సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆ భవనాన్ని పూర్తిస్థాయిలో తొలగించగా తాత్కాలికంగా రైతువేదిక వెనుక భాగంలో ఉన్న రూమ్‌లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రైతువేదిక నుంచే పశువైద్యశాల సేవలు అందిస్తున్నారు. కాగా ఇటీవల మండల కేంద్రంలో పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారి సమీపంలో నిర్మించిన నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించి పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. నెలరోజులు కావస్తున్నా పూర్తిస్థాయిలో కంప్యూటర్, సామాగ్రి తరలించకపోవడంతో ఇంకా ఆ భవనం తహసీల్దార్ అధీనంలోనే ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పశువైద్యశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మండలానికి మెరుగైన పశువైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తహసీల్దార్ భవనం

భవనంలోకి మారుతాం..



ఇటీవల నూతన భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించారు. మేము తహసీల్దార్ నాగరాజుతో మా భవనం మాకు తిరిగి ఇవ్వాలని కోరినాం. తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించిన కంప్యూటర్, ఇతర సామాగ్రి తరలించకపోవడంతో జాప్యం జరుగుతుంది. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో సామాగ్రి తరలించినన్నున్నారు. అనంతరం పశువైద్యశాలను పక్కా భవనంలోకి మార్చుతాం.

– సూరం బాలకృష్ణ,
మండల పశు వైద్యాధికారి, నడికూడ

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



బడిబాటలో పాల్గొన్న అనిత, ఉపాధ్యాయులు

ఐనవోలు : ప్రభుత్వ బడుల్లో చేరి నాణ్యమైన విద్య పొందాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి బీసీ కాలనీలో ఇంటింటికెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. విద్యార్థుల మానసిక సామర్థ్యం తెలుసుకుని అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతుందన్నారు. విద్యను అంగడి సరుకుగా మార్చి ప్రైవేటు విద్యా సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు మధుకర్, సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, రాజేశ్వరి, పద్మ, సమ్మక్క, యశోద, రేణుక, దీపిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మార్నేని'కి అభినందనలు



ఐనవోలు : తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన నందనం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం నియమితులయ్యారు. ఈ మేరకు మండల నాయకులు, ఆయన అభిమానులు, నందనం సొసైటీ డైరెక్టర్లు హైదరాబాద్‌లోని బ్యాంకు కేంద్ర కార్యాలయంలో ఆయకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నందనం సొసైటీలో డైరెక్టర్‌గా ఎన్నికైన మార్నేని రవీందర్‌రావు సొసైటీ చైర్మన్‌గా, వరంగల్ డీసీసీబీ చైర్మన్‌గా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులవడం సంతోషంగా ఉందని నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు తెలిపారు. కాగా పలు గ్రామాల్లో రవీందర్‌రావు అభిమానులు బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నందనం సొసైటీ డైరెక్టర్లు బొమ్మినేని బుచ్చిరెడ్డి, మేటీ చిరంజీవి, పూజారి రాంచంద్రం, మాదారపు సంపత్‌కుమార్, చింత బాబుతో పాటు సొసైటీ సీఈఓ కోతి సంపత్, మండల నాయకులు జోజిరెడ్డి, ఆడెపు దయాకర్, మునిగాల సంపత్‌కుమార్, బుర్ర రాజశేఖర్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ, శారీరక దారుఢ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కరాటే మాస్టర్లు

పరకాల : కరాటే నేర్చుకోవడం వలన శారీరక దారుఢ్యంతో పాటు బాల, బాలికల ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని క్రియేటివ్ కరాటే డూ వ్యవస్థాపకుడు, మాస్టర్ మాడ సంపత్‌కుమార్ అన్నారు. పట్టణంలో క్రియేటివ్ కరాటే డూ ఆధ్వర్యంలో గత నెలలో ప్రారంభమైన ఉచిత కరాటే శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ మేరకు 40 రోజుల పాటు సెల్ఫ్ డిఫెన్స్, నాన్‌చాక్స్, సింగిల్, డబుల్‌స్టిక్, స్క్వాడ్, కటా స్పారింగ్ విభాగంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు బెల్ట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ పాలకుర్తి పాపయ్య, మాస్టర్లు బొట్ల స్వామి, గడ్డం రాజు, పోచంపల్లి రితిక, మహ్మద్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సును అమలు చేయాలి



ఆత్మకూరు : స్వామినాథన్ కమిషన్ సిఫార్సును అమలు చేయాలని కోరుతూ అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం రాష్ట్ర నాయకుడు చిర్రా సూరి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వాలు రైతులకు మేలు రకాల విత్తనాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల రవాణా, పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మైదం పాణి, అర్షం అశోక్, సుధాకర్, భిక్షపతి, దొడ్డిపాక రాజన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతోనే కుటుంబాల ఆర్థిక పురోగతి



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య

నర్సంపేట : ప్రతీనెల డబ్బు పొదుపు చేసుకుంటేనే గౌడ కులస్తుల కుటుంబాల ఆర్థిక పురోగతికి బాటలు పడతాయని గౌడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గండి లింగయ్య గౌడ్ తెలిపారు. పట్టణంలోని పద్మశాలీ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన గౌడ సంక్షేమ సహకార పరమితి సంఘం ద్వితీయ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కులస్తుల ఐక్యత, సంక్షేమం కోసం పరస్పర సహకారం కీలకమని చెప్పారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మాచర్ల ఐలుమల్లు సంఘ నివేదిక సమర్పించారు. సంఘంలో రూ.కోటి 13 లక్షల 61వేల 433 ఉండగా సభ్యుల వాటా రూ.29 వేల 80 చొప్పున ఉండగా అందులో ఖర్చులు లక్ష 65 వేల 410 రూపాయల అయినట్లు ఆర్థిక కార్యదర్శి గండి రఘు ప్రకటించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం గౌడ వెల్ఫేర్ కమ్యూనిటీ భవన నిర్మాణం, సభ్యుల గ్రూపు ఇన్సూరెన్స్ చేయించేందుకు, రూ.2 లక్షల వరకు సాధారణ రుణ మంజూరు, తదితర అంశాలను తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు బూర అశోక్‌గౌడ్, ఊడురుగ శ్రీనివాస్, బూర వేణు, రావుల లక్ష్మీనారాయణ, గంధం చంద్రమౌళి, కక్కెర్ల అశోక్, గండి నర్సయ్య, కందుకూరి జనార్దన్, వల్లాల శ్రీహరి, నవీన్‌కుమార్, చీకటి శోభారాణి, దొంతి శ్రీలత, రామగోని సుధాకర్, గొడిశాల భాస్కర్, గండి సంతోశ్, అనంతుల రమేశ్, కారుపోతుల విజయ్‌కుమార్, తాళ్లపెల్లి చంద్రమౌళి, పంజాల వెంకట్, జూలూరి హరిప్రసాద్, తాళ్లపెల్లి కృష్ణ, కందుల శ్రీనివాస్, గుల్లపెల్లి ఉమేందర్, గిరగాని సాంబయ్య, వేముల సాంబయ్య, వెంకటనారాయణ, సోల్తి సారయ్య, దొమ్మటి సత్యం, డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్, గండి యాదగిరి, పెరుమాండ్ల ఉపేందర్, తాబేటి రవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసికోల్లాసం

రాయపర్తి : ఆధ్యాత్మికతతో మానసికోల్లాసం లభిస్తుందని నూర్–ఏ–మజీద్, అలంగిరి మజీద్‌ల సదర్‌లు హుస్సేన్, అమ్జద్‌ఖాన్ స్పష్టం చేశారు. నెల రోజులుగా ఇస్లామిక్ క్యాంపు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన చిన్నారులకు సోమవారం వారు బహుమతులు అందజేసి అభినందించారు. ఎండీ జుబేర్, మహ్మద్ అయాన్‌ఖాన్, ఎండీ.అయేషా ప్రతిభ చాటగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్, అమ్జద్ ఖాన్ పలు సూచనలు చేశారు.

బీజేపీతోనే యువతకు ఉపాధి

నర్సంపేట : బీజేపీతోనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని కల్‌నాయక్‌తండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు అధ్యక్షతన బీజేపీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. బీజేపీ యువతను ప్రోత్సహిస్తుందని తెలిపారు. రాజకీయాల్లో మెరుగైన అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. యువత రాజకీయాల్లోకి వస్తే దేశం మరింత ఉన్నతంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పార్లమెంటు కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, చెన్నారావుపేట మండల కన్వీనర్ దామెరుప్పుల శేఖర్, యువమోర్చా మండల అధ్యక్షుడు కొనకటి నవీన్‌రెడ్డి, నాయకులు దుంకదువ్వ రంజిత్, ఎర్ర రాజు, బక్కతట్ల రవీందర్, మురహరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

షాకిచ్చిన విద్యుత్ బిల్లు!

నడికూడ : మండలంలో విద్యుత్ వినియోగదారులు బిల్లు చూసి షాకయ్యారు. 30 రోజుల్లో విద్యుత్ రీడింగ్ తీయాల్సి ఉండగా మండల కేంద్రంలో 37 రోజులకు విద్యుత్తు రీడింగ్ తీశారు. దీంతో చాలా మందికి గృహజ్యోతి సబ్సిడీ వర్తించకుండా పోయింది. రెండు, మూడు యూనిట్ల తేడాతో పూర్తిస్థాయిలో బిల్లు చెల్లించాల్సి వచ్చిందని పలువురు వినియోగదారులు వాపోయారు. మరికొంతమంది వినియోగదారులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి తమకు గృహజ్యోతి సబ్సిడీ వర్తింపజేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వం రెండు నెలలు ఇచ్చిన సబ్సిడీ ఈ ఒక్క నెల బిల్లుతో తిరిగి ప్రభుత్వానికే చెల్లించినట్లు అయిందని వాపోయారు. రీడింగ్‌ను గడువులోపే తీసేలా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరారు.

కనువిందు చేస్తున్న 'గుల్‌మోహర్'



దామెర: చెట్టంతా విరబూసిన ఎర్ర పూల సోయగం బాటసారుల మనసు దోచుకుంటుంది. రమణీయంగా మనసుకు హత్తుకునేలా కనువిందు చేస్తున్నాయి గుల్‌మోహర్ పూల అందాలు. దామెర క్రాస్ నుంచి ల్యాదెళ్ల ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న గుల్‌మోహర్ చెట్లు విరబూశాయి. దీంతో ఎర్రని స్వాగత తోరణాలవలే ప్రకృతి ప్రేమికులకు స్వాగతం పలుకున్న భావన కలుగుతుంది. ఎండతీవ్రతను సైతం తట్టుకొని పూలు విరబూస్తుండటంతో వాహనదారులు, బాటసారులు ఈ చెట్ల కింద సేదతీరుతూ తమ ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- ధర్నా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తి : ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని గేమ్స్ ఆడి గెలుపొందిన కౌశిక్‌రెడ్డికి మంత్రి పొన్నం పై విమర్శలు చేసే అర్హత, స్థాయి లేదని మండిపడ్డారు. మంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగంగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామాల్లో తీరుగనివ్వబోమని హెచ్చరించారు. కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, ముప్పు మహేందర్, హింగె శ్రీకాంత్, శనిగరం వెంకటేష్, అంబాల శ్రీకాంత్, శీలం అనిల్‌కుమార్, గుడెల్లి నవీన్, కడారి సురేందర్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ నాయకుడు ఉస్మాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఉస్మాన్ మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలు, ఆరోగ్యం, గృహవసతి, నివాస స్థలాలు, పౌష్టికాహారం, నిత్యవసర వస్తువుల ధరల తగ్గింపు, విద్య, ఉద్యోగం లాంటి సమస్యలు పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. అవినీతి, నియంతృత్వ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా అప్రజాస్వామికంగా పాలన చేయడంతో ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు, యువజన సంఘాలు పోరాటం చేసి బీఆర్ఎస్‌ను గద్దె దింపాయని తెలిపారు. ప్రజల అభిప్రాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంట తిరుపతి, అరికిళ్ల సదానందం, చిలకల రాజయ్య, మంద భద్రయ్య, ముప్పారపు శంకర్, జావ్వాజి నర్సయ్య, సునీల్ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'మిషన్ భగీరథ' సర్వే



దామెరలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

దామెర : మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలంలోని 6,283 గృహాలకు నల్లా కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. కాగా ఇంటింటికి తిరుగుతూ కనెక్షన్ ఉందా.. ఉంటే నల్లాలు బిగించారా.. నీరు సరఫరా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాప్‌లో వివరాలు నమోదుచేయడంతో పాటు ఇంటి యజమాని ఫొటోను అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. కాగా మొదటిరోజు 433 ఇళ్లను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చేతన్‌రెడ్డి

ఆత్మకూరు : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి, నీరుకుళ్ల ప్రత్యేక అధికారి చేతన్‌రెడ్డి అన్నారు. సోమవారం నీరుకుళ్లలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో అందించే సేవల వివరాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతం చేయాలని కోరారు. ఈ వర్షాకాలంలో గ్రామస్తులు కాచిచల్లార్చిన నీళ్లు మాత్రమే తాగాలని అన్నారు. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఉందా.. లేదా తెలుసుకునేందుకు మిషన్ భగీరథ సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఇంటి యజమానులు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని అన్నారు. ఎంపీటీసీ వరుణ్‌గాంధీ, పంచాయతీ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వారంతపు సంతకు వేలం పూర్తి

నీరుకుళ్ల వారంతపు సంత నిర్వహణకు సోమవారం వేలం పాట పాడినట్లు ఎంపీఓ చేతన్‌రెడ్డి తెలిపారు. వేలం పాట రూ.28,200 లకు ఖరారైందని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రాజేందర్ అంగడి కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నట్లు ఆయన వివరించారు.


రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవలను అందించేందుకు శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీ, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి 121 మందికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారయణగౌడ్, సొసైటీ వైద్యులు డాక్టర్ జి.రాంకిషన్‌రావు, డాక్టర్ మహమ్మద్ తహర్‌మసూద్‌తో పాటు రెడ్‌క్రాస్ ఉద్యోగులు గుల్లెపల్లి శివకుమార్, గంగాధర్, పవన్, రమేశ్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారికంగా ప్రకటించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేలేరు : ధర్మసమాజ్ పార్టీ రూపొందించిన తెలంగాణ ప్రభుత్వ చిహ్నాన్ని అధికారికంగా ప్రకటించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హెచ్.కోమికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్ర ప్రసాద్ సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్పీ రూపొందించిన చిహ్నంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీ, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రం, అణగారిన వర్గాల రాజ్యం కోసం, హక్కుల కోసం పోరాటం చేసిన పండుగ సాయన్న, సార్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క–సారలమ్మల చిత్రాలను ఆ చిహ్నంలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శ్రీకర్, రఘు, పెండ్యాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.